

టెన్షన్ పెట్టిన చిన్నారులు

ఒంగోలు నగరంలోని ఓ ప్రైవేటు సంస్థకు చెందిన విద్యార్థులు తప్పిపోయి తల్లిదండ్రులను టెన్షన్ పెట్టారు. రెండు గంటలు గాలించిన తరువాత పోలీసులకు దొరికారు. - 4లో..



ఆటో బోల్తా..ఒకరు మృతి

కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందగా పది మందికి గాయాలైన ఘటన ముండ్లమూరు మండలం ఉల్లగల్లు వద్ద బుధవారం జరిగింది. - 4లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40 /26

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది.

బాలికలు టాప్ లేపారు..

పదో తరగతి పరీక్షల్లో బాలికలు అత్యుత్తమ మార్కులు సాధించారు. అటు ప్రభుత్వ పాఠశాలల్లో ఇటు ప్రైవేటు పాఠశాలల్లో వారిదే పైచేయిగా నిలిచింది. టంగుటూరు మండలం ఆలకూరపాడు జెడ్పీ హైస్కూలుకు చెందిన పుట్టా వెంకట భార్గవి 596 మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచింది. అలాగే 590 వరకూ మార్కులు సాధించిన వారిలో ఎక్కువ మంది బాలికలు ఉన్నారు. బుధవారం విడుదలైన ఈ ఫలితాల్లో 25,103 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 85.43 శాతంలో జిల్లా రాష్ట్రంలో తొమ్మిదో స్థానాన్ని కైవసం చేసుకుంది. గత ఏడాది 91.21 శాతంతో 7వ ర్యాంకు సాధించింది. 96 ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా అందులో 42 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.



పి.వి.హర్షిణి (597) | గగనశ్రీ (597) | చందన (596) | కె.వెంకట మోషిత కృష్ణశ్రీ (596) | కె.గురునాగ భవ్యశ్రీ (595) | సీహెచ్ సౌజన్య (595) | కె.లక్ష్మీ కావ్య (595) | దుగ్గిరెడ్డి దీక్ష (595) | ఎ.హరిణి (595) | నాగ సాయిశ్రీ (595)



పి.నవ్యశ్రీ (594) | జి.కౌసల్యబాయి (594) | ఖుషీ (593) | బచ్చిగారి లక్ష్మీప్రియ (593) | సాత్విక (591) | వైవీటి చంద్రిక (590) | షేక్ అంజు పర్వీన్ (590) | ఎం.ఆశ్లేష, (589) | మల్లవరపు ప్రణీత (588) | గుమ్మళ్ల స్నేహ (588)

- పది పరీక్షల్లో సత్తా చాటిన బాలికలు
- ప్రభుత్వ స్కూళ్లలో 596 మార్కులతో జిల్లా టాపర్‌గా ఆలకూరపాడు జెడ్పీ స్కూలు విద్యార్థిని పుట్టా వెంకట భార్గవి
- పలు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో అత్యుత్తమ మార్కులు బాలికలవే
- జిల్లాలో 96 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత సాధించగా అందులో 42 ప్రభుత్వ పాఠశాలలు
- 85.43 శాతంతో 29,386 మందికి గాను 25,103 మంది ఉత్తీర్ణత
- రాష్ట్రంలో 9వ స్థానానికి పడిపోయిన జిల్లా ర్యాంకు
- గత ఏడాది రాష్ట్ర స్థాయిలో ఏడో ర్యాంకు, 91 శాతం ఉత్తీర్ణత
- మార్కాపురం, ముండ్లమూరు మోడల్ స్కూళ్లలో, అర్థవీడు, హనుమంతునిపాడు, మర్రిపూడి, పీసీపల్లి, జరుగుమల్లి కేజీబీవీల్లో నూరు శాతం ఉత్తీర్ణత

ఒంగోలు సిటీ: పదో తరగతి పరీక్ష ఫలితాలు బుధవారం ప్రకటించారు. జిల్లాలో 14,880 మంది బాలురు, 14,506 మంది బాలికలు కలిపి 29,386 మంది పరీక్షలకు హాజరయ్యారు. అందులో 12,480 మంది (83.87 శాతం) బాలురు, 12,623 మంది (87.02 శాతం) బాలికలు మొత్తం 25,103 మంది (85.43శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వ్యాప్తంగా 21,661 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్‌లో, 2,570 మంది సెకెండ్ క్లాస్‌లో, 872 మంది థర్డ్ క్లాస్‌లో పాసయ్యారు. మిగిలిన 4,283 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం తగ్గిపోయింది.

బాలికలు టాప్..

- ఒంగోలుకు చెందిన విద్యార్థులు పి.వి.హర్షిణి 597, గగనశ్రీ 597 మార్కులు, ఎం.సాత్విక 596 మార్కులు, ఫర్హాన్ అజ్మల్ 593, వసంత సిరి 593, కె.మనస్విని 591, ఎస్కే.సుహన 590, అలియా యాస్మిన్ 589, జస్విత 593, బి.హర్షిణి 592, పి.మేఘన మనస్విని 590, కె.లక్ష్మీహరిత 592, పొత్తూరి చిన్మయలక్ష్మి 591, జి.కృష్ణహర్షిత 596, కె.హిరణ్య 591, గుజ్జుల మధులత 588, దీక్షిత 593, ఏకాంతిక సిరి 591 మార్కులు సాధించారు.
- బేస్తవారిపేట విద్యార్థిని కంకర చందన 596 మార్కులు, కొండపి మండలం కే.ఉప్పలపాడుకు చెందిన విద్యార్థిని వెంకట మోషిత కృష్ణశ్రీ 596 మార్కులు సాధించారు.
- కంభంకు చెందిన ఎ.హరిణి 595, సీహెచ్ సౌజన్య 595, కె.గురునాగ భవ్యశ్రీ 595, కె.లక్ష్మీ కావ్య 595 మార్కులు, సీహెచ్ చందనా భారతి 593 మార్కులు, పీ రక్షిత 593, బీ రామ చరణ్ 593, జె వెంకట నాగ ఉమామహేశ్వర్ 593 మార్కులు సాధించారు.
- కనిగిరికి చెందిన శ్రీ దుగ్గిరెడ్డి దీక్ష 595 మార్కులు సాధించింది.
- గిద్దలూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎం.ఖుషీ అనే విద్యార్థిని 593 మార్కులు, కె.కరిష్మా 591 మార్కులు సాధించారు.
- రాచర్ల మండలంలో ఆకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 33 మందికిగాను అందరూ ఉత్తీర్ణులై నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. వారిలో బచ్చిగారి లక్ష్మీప్రియ 593 మార్కులు సాధించింది.
- వెలిగండ్ల జెడ్పీహైస్కూల్‌కు చెందిన డీ లక్ష్మీ జాహ్నవి 593 మార్కులు సాధించింది.
- మార్కాపురం మండలంలోని మిట్టమీదిపల్లి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని సాత్విక 591 మార్కులు, సుఫియన్ 588 మార్కులు సాధించారు. మార్కాపురం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో వైవీటి చంద్రిక 590 మార్కులు సాధించింది. మార్కాపురానికి చెందిన నాగసాయిశ్రీ 595, పి.నవ్యశ్రీ 594. కౌసల్య బాయి 594, డి.నాగశ్రీ 591, హాసిని (590), గిద్దలూరుకు చెందిన మానిషా (590) మార్కులు సాధించారు.
- సింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ అంజు పర్వీన్ 590 మార్కులు సాధించింది.
- తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ముత్తూరి అశ్లేష 589 మార్కులు సాధించింది. చెన్నారెడ్డిపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన గోగిరెడ్డి వెంకట నీల 585 మార్కులు తెచ్చుకుంది.
- జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మల్లవరపు ప్రణీత 588 మార్కులు, కె బిట్రగుంట కేజీబీవీ పాఠశాలకు చెందిన మేడికొండ ఐశ్వర్య 587 మార్కులు సాధించారు.
- పామూరు మండలం కంభాలదిన్నె జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని గుమ్మళ్ల స్నేహ 588 మార్కులు సాధించింది.

ఫలితాల్లో వెనుకబడిన జిల్లా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రకాశం జిల్లా ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం, ర్యాంకుల పరంగా వెనుకబడింది. గత ప్రభుత్వంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 91.21 శాతం సాధించి జిల్లా రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2025 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా వ్యాప్తంగా 29,386 మందికి గాను 25,103 మంది ఉత్తీర్ణతతో 85.43 శాతం సాధించి తొమ్మిదో స్థానానికి పడిపోయింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 6 ఏపీ మోడల్ స్కూల్స్‌లో మొత్తం 444 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా, 406 మంది పాసై 91.4 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ఏపీ ఎంఎస్ ముండ్లమూరు, ఏపీ ఎంఎస్ మిట్టమీదిపల్లె, మార్కాపురంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 28 కేజీబీవీల్లోని మొత్తం 1017 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా, 881 మంది 86.63 శాతం ఉత్తీర్ణత సాధించారు. 136 మంది ఫెయిలయ్యారు. అర్థవీడు, హనుమంతునిపాడు, మర్రిపూడి, పీసీపల్లి మండలాల్లోని కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించిన యాజమాన్యాలు

మేనేజ్‌మెంట్	పాఠశాలల సంఖ్య
ఎయిడెడ్	2
ఏపీ మోడల్ స్కూల్స్	2
ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్	1
ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్	3
ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్	1
బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్	3
కేజీబీవీ స్కూల్స్	5
ప్రైవేట్ స్కూల్స్	54
జెడ్పీ హైస్కూల్	25
మొత్తం	96

యాజమాన్యం వారీగా ఉత్తీర్ణత శాతం:

ఎయిడెడ్ 73.42 శాతం, బీసీ వెల్ఫేర్ 96.79 శాతం, ఏపీ మోడల్ స్కూల్స్ లో 90.99 శాతం, ఏపీ రెసిడెన్షియల్ 97.6 శాతం, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో 94.87 శాతం, ఏపీటీడబ్ల్యూహెచ్ఎస్‌లో 46.3 శాతం, ఏపీటీడబ్ల్యూఎస్ లో 72.66 శాతం, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 96.79 శాతం, ప్రభుత్వ పాఠశాలల్లో 63.49 శాతం, కేజీబీవీల్లో 86.53 శాతం, ఎంపీఎల్ లో 77.01 శాతం చొప్పున అన్నీ యాజమాన్యాల్లో కలిసి 85.43 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా టాపర్‌గా భార్గవి



ఆలకూరపాడు జెడ్పీ హైస్కూల్‌లో 596 మార్కులు సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న డీఈఓ కిరణ్ కుమార్

టంగుటూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో టంగుటూరు మండలంలోని ఆలకూరపాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని పుట్ట వెంకట భార్గవి 596 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో జిల్లా ప్రథమ స్థానం సాధించింది. భార్గవిని విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్, డిప్యూటీ డీఈఓ చంద్రమౌలేశ్వర్, ఎంఈఓ-2 తన్నీరు బాలాజీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతటి గొప్ప ఫలితం సాధించడానికి సమష్టికృషి చేసిన ప్రధానోపాధ్యాయులు వాకా వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులను వారు ప్రత్యేకంగా అభినందించారు. 43 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 39 మంది ఉత్తీర్ణత సాధించారు. 36 మంది ప్రథమ శ్రేణి లో ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఝాన్సీ రాణి విద్యా కమిటీ చైర్మన్ పున్నయ్య చౌదరి, ఉపాధ్యాయులు శ్రీధర్ బాబు, సురేష్,వెంకటరావు, సుబ్బారావు, చెన్నయ్య భూషణ్ రెడ్డి,సుభాషిని, విజయలక్ష్మి,జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడుతూ..చదివిస్తూ..

పుట్ట వెంకట భార్గవి తల్లిదండ్రులు రామ్మోహన్‌రావు పెట్రోల్ బంక్ లో పంపు బాయ్ గా పని చేస్తుండగా, తల్లి టైలరింగ్ చేస్తూ చదివిస్తూ వచ్చింది. చదువులో ముందంజలో ఉన్న భార్గవిని పాలకూరపాడు ప్రభుత్వ పాఠశాలలో చదువు చక్కగా చెబుతున్నారని ఉద్దేశంతో టంగుటూరు నుంచి ఆలకూరపాడుకు మార్చారు. తల్లిదండ్రుల కష్టాన్ని గమనించిన భార్గవి ఇంజినీర్ కావాలనే ఉద్దేశంతో పట్టుదలతో చదివి జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించింది. ట్రిపుల్ ఐటీ సీటు వస్తే మంచి ఇంజినీర్ అవుతానని భార్గవి చెబుతోంది. జిల్లా ప్రథమ స్థానం రావడం ఎంతో సంతోషంగా ఉందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

78.68 శాతం ఉత్తీర్ణత సాధించిన ఎస్సీ హాస్టల్ విద్యార్థులు

ఒంగోలు వన్‌టౌన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల విద్యార్థులు 78.68 శాతం ఉత్తీర్ణత సాధించారు. 12 వసతి గృహాల్లో నూరు శాతం ఫలితాలు సాధించారు. 570 కంటే ఎక్కువ మార్కులను 8 మంది, 500 కంటే ఎక్కువ మార్కులను 110 మంది, ఫస్ట్‌క్లాస్‌లో 536 మంది, సెకండ్ క్లాస్‌లో 129 మంది, థర్డ్ క్లాస్‌లో 36 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలోని ప్రభుత్వ బీసీ వసతి గృహాల విద్యార్థులు 612 మందికిగానూ 507 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్ట్ క్లాస్‌లో 400, సెకండ్ క్లాస్‌లో 77, థర్డ్ క్లాస్‌లో 30 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 82.84 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్ అభినందించారు.

బియ్యం లావాదేవీలా.. భూ వివాదాలా..!

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య పోలీసులకు పెను సవాల్‌గా మారింది. అధికార తెలుగుదేశం పార్టీలో అలజడి సృష్టించింది. సంచలనం రేకెత్తించిన ఈ హత్య కేసుకు సంబంధించి జిల్లాలో రకరకాల కథనాలు ప్రచారం జరుగుతున్నాయి. ప్రధానంగా భూ, లిక్కర్, పీడీఎస్ రైస్ వివాదాలే హత్యకు దారితీసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే పదుల సంఖ్యలో అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

- ప్రైవేటు భూముల వివాదమే వీరయ్య చౌదరి హత్యకు పురికొల్పినట్లు ప్రచారం
- పక్కాగా రెక్కీ నిర్వహించి హతమార్చినట్లు సమాచారం
- నగరాన్ని జల్లెడ పడుతున్న పోలీసులు
- లాడ్జీలు, కాలనీల్లో విస్తృతంగా తనిఖీలు
- అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు
- రాత్రికి రాత్రి నగరానికి వచ్చిన హోం మంత్రి అనిత
- అమ్మనబ్రోలులో అంత్యక్రియలకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు



హత్యకు గురైన వీరయ్య చౌదరి మృతదేహం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న హోంమంత్రి, ఎస్పీ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: అధికార తెలుగుదేశం పార్టీ నాయకుడు, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ, బాపట్ల జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య జిల్లాలో సంచలనం రేకెత్తించింది. సంఘటన జరిగి 24 గంటలు పూర్తి కావస్తున్నా ఇంత వరకూ సరైన క్లూ లభించలేదని పోలీస్ వర్గాలు పేర్కొంటున్నాయి. మంగళవారం రాత్రి వీరయ్య చౌదరి హత్య జరిగిన తరువాత రాత్రికి రాత్రే హోం మంత్రి అనిత ఒంగోలుకు వచ్చారు. జీజీహెచ్‌కు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. అంతకు ముందే మంత్రులు బాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి జీజీహెచ్‌కు చేరుకుని మృతదేహాన్ని సందర్శించారు. ఇక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం అమ్మనబ్రోలులో జరిగిన వీరయ్య చౌదరి అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ హత్యను అధికార పార్టీ ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థమవుతోంది. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు నగరాన్ని జల్లెడ పడుతున్నారు. అనుమానితులను పోలీసు స్టేషన్‌కు తరలించి అన్నీ కోణాల్లో విచారణ జరుపుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ నిందితుల కోసం గాలిస్తున్నారు. ఇప్పటి వరకూ పదుల సంఖ్యలో అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బియ్యం వివాదాల కోణంలో గుంటూరు జిల్లా నిడుబ్రోలుకు చెందిన గోపి, అమీర్, అశోక్ అనే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అలాగే బాపట్ల జిల్లా వెదుళ్లపల్లికి చెందిన రైసుమిల్లు యజమానిని, నాగులుప్పలపాడుకు చెందిన ఒక వ్యాపారిని విచారిస్తున్నట్లు తెలిసింది.

భూ వివాదాలే హత్యకు దారి తీశాయా...

వీరయ్య చౌదరికి అనేక భూ వివాదాలతో సంబంధం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల కొంత కాలంగా పొరుగు రాష్ట్రమైన బెంగళూరు, తెలంగాణాల్లో కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ కూడా ఆయనకు భూ వివాదాలు ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. అలాగే వైజాగ్, ఉభయ గోదావరి జిల్లాలతో పాటుగా జిల్లా దొర్నాల వద్ద కూడా భూ వివాదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. ప్రధానంగా రామాయపట్నం, గుడ్లూరు మండలంలోని భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యవహారంలో వివాదాలు తలెత్తాయనే ప్రచారం జరుగుతోంది. ఈ వివాదం ఏమైనా కారణమా అన్న కోణంలో ప్రత్యేక పోలీసులు బృందాలు ఆరా తీస్తున్నాయి. రెవెన్యూ అధికారులు అందరితో వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి పట్టణానికి చెందిన వ్యక్తిపై సైతం నిఘా ఉంచినట్లు తెలిసింది.

లిక్కర్ సిండికేట్‌తో వివాదాలు...

తొలి నుంచి వీరయ్య చౌదరి మద్యం వ్యాపారాల్లో క్రియాశీలకంగా వ్యవహరించేవారని తెలుస్తోంది. ప్రకాశం జిల్లా, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఆయనకు మద్యం వ్యాపారాలు ఉన్నాయి. మద్యం సిండికేట్లతో కూడా ఆయనకు వివాదాలు ఉన్నట్లు ప్రచారం. ఈ విషయంలో ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న ఒక మంత్రి వద్ద రాజీ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. అయినప్పటికీ లిక్కర్ వివాదాలు ఆయనను వెన్నాడుతున్నట్లు చెప్పుకుంటున్నారు. వీరయ్య చౌదరి హత్య కేసులో మద్యం సిండికేట్ల పాత్ర మీదా విచారణ జరుపుతున్నారు.

రెక్కీ చేసిన తరువాతే హత్య జరిగిందా..

వీరయ్య చౌదరి హత్యకు ముందు నిందితులు నగరంలోని ఒక హోటల్లో ఉన్నట్టు పోలీసుల విచారణలో తెలిసినట్లు ప్రచారం జరుగుతోంది. పది రోజుల పాటు నగరంలో ఉన్న నిందితులు వీరయ్య చౌదరికి సంబంధించిన అన్నీ విషయాలను సేకరించినట్లు తెలిసింది. ఆయన రోజువారి కార్యకలాపాలు, ఒంటరిగా ఉండే సమయం లాంటి వివరాలను సేకరించినట్లు చెప్పుకుంటున్నారు. హత్యకు ముందు మూడు రోజుల పాటు ఆయన కార్యాలయం వద్ద రెక్కీ నిర్వహించినట్లు తెలిసింది. హత్య జరిగిన రోజు కూడా నిందితులు వీరయ్య చౌదరిని అనుసరించినట్లు చెప్పుకుంటున్నారు. నాగులుప్పలపాడు పార్టీ నియామకాలకు సంబంధించి సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయకుమార్‌ను వీరయ్య చౌదరి కలిసి చర్చించినట్టు సమాచారం. ఆపై 5 గంటల తరువాత ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఇంటికి వెళ్లి కలిసినట్లు తెలుస్తోంది. ఈ విషయాలను పసిగట్టిన తరువాత వీరయ్య ఒంటరిగా ఉండే సమయాన్ని ఎంచుకొని హత్యకు పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది. హత్య చేసిన తరువాత నిందితులు ఒక స్కూటీ, మోటారు బైకు మీద తప్పించుకొని పరారయ్యారని సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు తెలుస్తోంది. మొత్తం ఆరుగురు నిందితులు వచ్చారని, ఇద్దరు కింద కాపలా ఉండగా నలుగురు పై అంతస్తులోకి వెళ్లి హత్యకు పాల్పడ్డారని విశ్వసనీయ సమాచారం.

నగరాన్ని జల్లెడ పడుతున్న పోలీసులు...

వీరయ్య చౌదరి హత్యను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. మొత్తం 12 బృందాలను, 40 మంది పోలీసులను రంగంలోకి దించారు. నగరాన్ని అడుగడుగునా జల్లెడ పడుతున్నారు. నగరంలోని లాడ్జీలను తనిఖీలు చేస్తున్నారు. నాలుగు రోజులుగా లాడ్జిలకు వచ్చిన వారి వివరాలు, ఎంత మంది వచ్చారు. ఎన్ని రోజులు ఉన్నారు అనే విషయాలను సేకరిస్తున్నారు. వారి ఆధార్ కార్డులను పరిశీలిస్తున్నట్లు సమాచారం. లాడ్జిలతో పాటుగా నగరంలోని శివారు ప్రాంతాల్లోని కాలనీల్లో కూడా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది.

సీఎం చంద్రబాబు, హోం మంత్రి అనిత ఒకటే మాట...

వీరయ్య చౌదరి హత్యకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు, హోం మంత్రి అనిత మీడియా ముందు ఒకే రీతిగా స్పందించారు. అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని చెప్పారు. జరిగిన విషయంపై వ్యాపార లావాదేవీలు, మద్యం సిండికేట్లతో ఉన్న వివాదాల గురించి సమగ్ర విచారణ చేస్తున్నామని చెప్పారు. నేరుగా వారే ఈ కేసును పర్యవేక్షిస్తుండడంతో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

రేపు రెవెన్యూ అసోసియేషన్ సమావేశం

ఒంగోలు సబర్బన్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రెవెన్యూ సంఘ ప్రతినిధులు, తహశీల్దార్లతో సమన్వయ కమిటీ సమావేశం ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిన్నిక మధుసూదనరావు, ఆర్.వాసుదేవరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ఏపీ ఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీఆర్ఎస్ఏ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు హాజరవుతారని చెప్పారు. సాయంత్రం 3 గంటలకు నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లోని రత్నమహల్ వెనుక వైపు ఉన్న సరోవర్ హోటల్‌లో సమావేశం జరుగుతుందన్నారు. ముందుగా ఉదయం 10 గంటలకు సరోవర్ లోనే ఏపీఆర్ఎస్ఏ అమరావతి సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.

ఉగ్ర దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన

ఒంగోలు సిటీ: జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం దగ్గర పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఒంగోలులోని బాపూజీ మార్కెట్ సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో బుధవారం నిరసన తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో సుమారు 26 మంది చనిపోయారని, 20 మంది క్షతగాత్రులు అయ్యారన్నారు. ఇది చాలా హేయమైన ఘటన అని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కాశ్మీరు చాలా సుందరమైన ప్రదేశమని, టూరిస్టులు ఈ ప్రాంతానికి రాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఉగ్రవాదులు దాడులు చేస్తున్నారని అన్నారు. ఇది చాలా బాధాకరమన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. వాళ్ల ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నామన్నారు. ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మాట్లాడుతూ కాశ్మీర్ లో ఉగ్రవాదులు జరిపిన దాడిని వ్యతిరేకిస్తూ చనిపోయిన మృతులకు నివాళులర్పిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించామన్నారు. భారతదేశపు ఐక్యతను, సమగ్రతను విచ్ఛిన్నం చేయాలని పొరుగుదేశానికి చెందిన టెర్రరిస్టులు ప్రయత్నిస్తున్నారన్నారు. చాలా కాలం తర్వాత ప్రశాంత వాతావరణంలో కాశ్మీరు అభివృద్ధి చెందుతుంటే పొరుగు దేశం చిచ్చుపెడుతోందన్నారు. భారతదేశం మొత్తం ఐక్యంగా ఉంటుందని, ప్రపంచానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, జిల్లా మహిళా అధ్యక్షులు దుంపా రమణమ్మ, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, మహిళా నాయకులు పేరం ప్రసన్న, ఎస్.రమణమ్మ, సాధం విజయలక్ష్మి, వి.వాణి, గాయం సావిత్రిదేవి, మేరీకుమారి, పిగిలి శ్రీను, ఆనం శ్రీనివాసరెడ్డి, ఎస్.వెంగారెడ్డి, చింతా సతీష్‌రెడ్డి, దుంపా చెంచిరెడ్డి, హౌసింగ్‌బోర్డు చిన్న, కె.స్వామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, చుండూరి రవిబాబు, దద్దాల నారాయణ యాదవ్ తదితరులు

క్లుప్తంగా

మద్యం వాహనం బోల్తా



రోడ్డుపై బోల్తా పడిన మద్యం వాహనం

పొదిలి రూరల్: మండలంలోని సలకనూతల సమీపంలో మద్యం తరలించే వాహనం బోల్తాపడింది. దీంతో వాహనంలో ఉన్న మద్యం బాటిళ్లు కొన్ని పగిలిపోయాయి. మార్కాపురం నుంచి దర్శికి మద్యం లోడులో వెళుతున్న వాహనం ప్రమాదానికి గురై బోల్తా పడింది. అయితే ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. మద్యం బాటిళ్లు రోడ్డుపై చిందరవందరగా పడడంతో బాటిళ్ల కోసం కొంతమంది ఎగబడ్డారు. ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

కుక్కల దాడిలో 15 గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలను చపుతున్న బాధితుడు శ్రీను

తర్లుపాడు: కుక్కల దాడిలో 15 గొర్రెల మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని గానుగపెంటలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. బాధితుడు అమ్మనబ్రోలు శ్రీను తెలిపిన వివరాల మేరకు..గ్రామ శివారులోని దొడ్లో మధ్యాహ్నం సమయంలో గొర్రెలను తోలి ఇంటికివచ్చిన సమయంలో కుక్కలు దాడి చేసి చంపినట్లు తెలిపారు. సుమారు రూ.1.20 లక్షల నష్టం జరిగినట్లు వివరించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కాగా గ్రామంలో గత నెలలో కూడా కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందాయి. గ్రామంలో ఎక్కువగా గొర్రెలు పెంచుకుంటూ పలువురు జీవనాధారం సాగిస్తున్నారు. పంచాయతీ, వెటర్నరీ అధికారులు జోక్యం చేసుకుని కుక్కల బెడద నుంచి విముక్తి కలిగించాలని సర్పంచ్ పుచ్చకాయల బాలయ్య కోరారు.

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న మలేరియా అధికారి

కొత్తపట్నం: మలేరియా, డెంగీ వ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి మధుసూదనరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగీ వ్యాధుల గురించి రికార్డులు పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యల గురించి డాక్టర్ రమ్యదీపికకు వివరించారు. ఏఎన్‌ఎంలు మలేరియా జ్వరాలను ఎలా గుర్తించారు, వారు సేకరించిన రక్త పూత నమూనాలు పరిశీలించారు. దోమల నివారణ చర్యలు, దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జ్వరం వచ్చిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఆ వ్యక్తిని జ్వరం తగ్గే వరకు నిఘా ఉంచాలన్నారు. డాక్టర్ రమ్యదీపిక, సబ్ యూనిట్ ఆఫీసర్ సాగర్, పి.శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, పీహెచ్ సూపర్‌వైజర్ పి.ప్రభాకర్, హెచ్‌వీ సులోచన తదితరులు పాల్గొన్నారు.

170 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

దొనకొండ:

గ్రామాల్లో రేషన్ డీలర్ల వద్ద కొనుగోలు చేసి నిల్వ చేసిన 170 బస్తాల రేషన్ బియ్యాన్ని ఒంగోలు విజిలెన్స్ సీఐ రవిబాబు, ఎస్సై నాగేశ్వరరావు సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే..దొనకొండకు చెందిన మాడిశెట్టి నారాయణ గ్రామాల్లోని రేషన్ డీలర్ల వద్ద బియ్యాన్ని కొనుగోలు చేసి స్థానిక బ్రాహ్మరావుపేటలోని సాయిబాబా గుడి సమీపంలో మాదాల రాము ఇంట్లో నిల్వ చేశాడు. సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు బియ్యాన్ని పట్టుకున్నారు. అనంతరం విజిలెన్స్ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాక్రిష్ణకు సమాచారం అందజేశారు. బియ్యాన్ని గోడౌన్‌కు తరలించి డీటీ షేక్ సుష్మాకు అప్పగించారు. నారాయణపై 6ఏ కేసు నమోదు చేశారు.

సెలవిచ్చేశారు.. సందడి చేద్దాం..



కేరింతలు కొడుతున్న బాలికలు



మళ్లీ కలుద్దాం...



జ్ఞాపకాలు పదిలంగా..

విద్యా సంవత్సరం ముగిసి వేసవి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు సంతోషంగా ఇంటిబాట పట్టారు. ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు పాఠశాలకు బైబై చెప్పారు. పాఠశాల చివరి రోజు విద్యార్థులంతా కేరింతలు కొట్టారు. గులాములు చల్లుకుంటూ సందడి చేశారు. వేసవి సెలవులు జూన్ 11 వరకు కొనసాగుతాయి. తిరిగి పాఠశాలలు జూన్ 12న పునఃప్రారంభం కానున్నాయి.

-సాక్షి, ఒంగోలు



ఇంటిబాట..



రంగులు పులిమేద్దాం...



ఇంటికి చలో చలో..



మళ్లీ కలుద్దాం మిత్రమా..







ఆటో బోల్తా

- ఒకరు మృతి, 10 మందికి గాయాలు

ముండ్లమూరు(కురిచేడు): మండలంలోని ఉల్లగల్లు వద్ద కూలీల ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందగా పది మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. దర్శి మండలం లంకజనపల్లి గ్రామం నుంచి ముండ్లమూరు మండలం ఉమామహేశ్వరపురం మిరపకాయల కోతకు కూలీలు వెళుతున్నారు. ఆటో ఉల్లగల్లు వద్దకు వెళ్లే సరికి ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి బోల్తాపడి బండి శారమ్మ(50) అనే కూలీ అక్కడికక్కడే మృతి చెందగా మరో పది మందికి గాయాలయ్యాయి. ప్రమాదంలో వెంకట అచ్చమ్మ, రిఫ్కా, కృపమ్మ, అంజమ్మ, ఆనంద్ కుమారి, వెంకటరమణ, ఏసమ్మ, అంజమ్మ, మార్తమ్మ, గురవయ్యలకు గాయాలు కాగా వారిని 108 వాహనాల్లో దర్శి ప్రభుత్వ వైద్యశాలకుతరలించారు. క్షతగాత్రుల్లో ఆరుగురిని మెరుగైన వైద్యం నిమిత్తం నర్సరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.



శారమ్మ మృతదేహం



వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగ్రాతులు



గాయపడ్డవారిని 108లోకి తరలిస్తున్న సిబ్బంది

పరిమితికి మించడంతోనే ప్రమాదం..

పరిమితికి మించి కూలీలను ఆటో ఎక్కించడంతోనే ప్రమాదం జరిగింది. కూలీలు ఎక్కువ మందిని ఎక్కిస్తే ఎక్కువ బాడుగ వస్తుందని అత్యాశకు పోవడంతో వ్యవసాయ సీజన్‌లలో ఇలాంటి ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయి. ఆటోకు ఐదుగురిని మించి ఎక్కించరాదు, కానీ ఒక్కో ఆటో 20 నుంచి 25 మందిని సైతం ఎక్కించి ప్రయాణాలు చేస్తున్నారు. అధికారులు వీటిపై దృష్టి సారించకపోవడంతో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతూనే ఉన్నాయి.

టెన్షన్ పెట్టిన చిన్నారులు

- రెండు గంటల తరువాత తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు

ఒంగోలు టౌన్: నగరంలోని ఒక ప్రైవేట్ విద్యా సంస్థలో చదువుకుంటున్న చిన్నారులు తప్పిపోయారు. రెండు గంటలకు పైగా గాలించిన తరువాత పోలీసులకు దొరికారు. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని అన్నవరప్పాడులో ఉన్న ఒక ప్రైవేట్ విద్యానికేతన్‌లో షేక్ ఇస్మాయిల్, కొంపసాల బిల్వనాథ్, అప్పాడిపాడు పార్థులు మూడో తరగతి చదువుతున్నారు. బుధవారం మధ్యాహ్నం 12.20 గంటలకు స్కూలు వదిలిపెట్టారు. పుస్తకాల సంచులను స్కూలులోనే ఉంచిన చిన్నారులు స్కూలు బయటకు వెళ్లారు. అలా వెళ్లిన వారు తిరిగి రాలేదు. ఈ లోగా తలిదండ్రులు వచ్చి తమ చిన్నారుల కోసం చూడగా స్కూలులో కనిపించలేదు. పాఠశాల స్టిబందిని అడిగితే ఇప్పటిదాకా ఇక్కడే ఉన్నారు, అంతలోనే ఎక్కడకు వెళ్లారంటూ చెప్పడంతో తలిదండ్రులు గుండెల్లో రాయి పడ్డట్టయింది. దీంతో పిల్లలు కనిపించకుండా పోయారన్న విషయం స్కూలు యాజమాన్యానికి తెలిసింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు తలిదండ్రులు పిల్లల కోసం వీధుల వెంట గాలింపు మొదలు పెట్టారు. ఎక్కడకు వెళ్లినా పిల్లలు కనిపించకపోవడంతో భయాందోళనకు గురయ్యారు. చివరకు టూటౌన్ పోలీసులకు తెలిపారు. వారు కూడా రంగంలోకి దిగి గాలించగా చివరికి బాలాజీనగర్‌లో అగ్రహారం రైల్వే గేటు వద్ద విద్యార్థులు కనిపించారు. టూటౌన్ ఇన్‌స్పెక్టర్ మేడా శ్రీనివాసరావు సమక్షంలో విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో చిన్నారుల తలిదండ్రులు, స్కూలు యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. తప్పిపోయిన పిల్లలను కేవలం రెండు గంటల వ్యవధిలోనే తలిదండ్రులకు అప్పగించడంలో సహకరించిన సీఐకు ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



సింగరాయకొండలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న హిందూ, ముస్లిం, మైనార్టీ నాయకులు



దర్శి ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మహిళలు

సింగరాయకొండ: ముస్లింలను అణగదొక్కడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును తీసుకువచ్చారని ముస్లిం నాయకులు, వామపక్ష పార్టీల నేతలు ఆరోపించారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం హిందూ, ముస్లిం, మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ముస్లిం నాయకులు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ద్వారా ముస్లింల ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తరువాత క్రైస్తవ, హిందూ ఆలయ భూములను సైతం స్వాధీనం చేసుకుంటారన్నారు. మోడీ ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చిన ఆంధ్ర, బీహార్ రాష్ట్రాల ప్రభుత్వాలు బిల్లును వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. శాంతియుత ర్యాలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న పెద్ద మసీదు నుంచి ప్రారంభమై మినీ బైపాస్ రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, పోలీస్‌స్టేషన్ సెంటర్ మీదుగా కందుకూరు రోడ్డు సెంటర్ వరకు చేరి మానవహారంగా ఏర్పడ్డారు. అంతకు ముందు పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావ్ పూలే, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీలో హిందూ, ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. వైఎస్సార్ సీపీ, సీపీఐ, సీపీఎం, దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దర్శి (కురిచేడు): వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దర్శిలో ముస్లింలు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. గంగవరం రోడ్డులోని మర్కస్ మసీద్ నుంచి గడియార స్తంభం వరకు జాతీయ జెండాలు పట్టుకుని ర్యాలీ చేశారు. అనంతరం డీటీ దేవప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గడియార స్తంభం సెంటర్లో ముస్లిం పెద్దలు మాట్లాడుతూ దేశంలో ముస్లింల హక్కులు హరిస్తున్నారని, ముస్లింల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసుకున్న వక్ఫ్ భూములు, ఆస్తులను చట్టం రూపంలో ప్రభుత్వం దోచుకునేందుకు తెరతీసిందన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతర సభ్యుల నియామకం తమ హక్కులకు భంగం కలిగించేలా ఉందన్నారు. చట్టం అందరికీ ఒకేలా ఉంటుందని చెప్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ముస్లింల విషయంలో మాత్రం మరోలా ఎందుకు వ్యవహరిస్తోందని, రాజ్యాంగంలో ఇచ్చిన మత స్వేచ్ఛను, మత కార్యకలాపాల విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవటం సరికాదన్నారు. వెంటనే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మత పెద్దలు, మసీదుల ప్రతినిధులు, నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి ముస్లింలు పాల్గొన్నారు.

చీకటి దారుల్ని వెలిగించే పుస్తకాలు

ఒంగోలు టౌన్: పుస్తకాలు జీవితంలోని చీకటిదారులను వెలిగించే దీపాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం పుస్తకాలను ప్రదర్శన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పుస్తకాలను చదవడం ఎంతో మంచి అలవాటని, దీని వల్ల మెదడు క్రియాశీలకంగా పనిచేస్తుందని, మానసిక వికాసాన్ని పెంపొదిస్తుందని తెలిపారు. ప్రపంచంలో పుస్తకాలు చదివి చెడిపోయిన వాళ్లు లేరని, విజేతలుగా ప్రసిద్ధి చెందిన వారంతా పుస్తకాలను చదివిన వారేనని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, గ్రంథాలయ సిబ్బంది కృష్ణవేణి, శివకుమారి, శాంసన్, మృదుల్ కుమార్, ఇమ్మానుయేలు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం

డిగ్రీ ఫలితాల్లో యూనివర్శిటీ ర్యాంకర్లు

- అభినందనలు తెలిపిన వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్శిటీ యూజీ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలలో అన్ని విభాగాల్లో యూనివర్శిటీ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరచి యూనివర్శిటీ స్థాయి ర్యాంకును పొందిన విద్యార్థుల వివరాలను ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఏ.సి.ఈ డాక్టర్ అంచుల భారతీదేవి వెల్లడించారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలో ఉన్న 88 కళాశాలల నుంచి మొత్తం 8114 మంది విద్యార్థులు హాజరు కాగా 3956 మంది విద్యార్థులు 48.76 శాతం మేరకు ఉత్తీర్ణత సాధించినా వివిధ విభాగాల్లో అత్యుత్తమ స్థాయి మార్కులను కైవసం చేసుకున్నారు. బీఏ హానర్స్ విభాగంలో మొదటి ర్యాంకును పి. భరత్ చంద్ర (జీడీసీ, వై, పాలెం), రెండో ర్యాంకును కె.ఆనంద్ జోసయ్య (జీడీసీ, ఉలవపాడు), సీహెచ్ ప్రణవి (జీసీ అండ్ వైపీఎస్ డిగ్రీ కళాశాల, కనిగిరి), మూడో ర్యాంకును ఎం.సాద్విక (బీబీహెచ్ డిగ్రీ కళాశాల, వేటపాలెం), బీకాం కంప్యూటర్ అప్లికేషన్ విభాగంలో మొదటి ర్యాంకును బి. మేఘన (చైతన్య భారతి డిగ్రీ కళాశాల, చీరాల) రెండో ర్యాంకును సయ్యద్ ఆకీబ్ (ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల, కంభం), మూడో ర్యాంకును డి.మానస (జీఆర్‌కే డిగ్రీ కళాశాల, ఒంగోలు), బీకాం జనరల్ విభాగంలో మొదటి ర్యాంక్‌ను బెజవాడ మౌనిక (శ్రీ ప్రతిభ డిగ్రీ కళాశాల, కందుకూరు), రెండో ర్యాంకును వి. రంగ శైలజ (వై.ఏ.ప్రభుత్వ మహిళా కళాశాల, చీరాల), బీఏ వొకేషనల్ విభాగంలో మొదటి ర్యాంకును ఎం.రిషికా రాణి, రెండో ర్యాంకును ఏ. ఉమామహేశ్వరి (ఆల్ఫా డిగ్రీ కళాశాల, కనిగిరి), మూడో ర్యాంకును వై. రజిత (ఏఎల్ఏన్ఎం మహిళా డిగ్రీ కళాశాల, కనిగిరి), బీఎస్సీ హానర్స్ విభాగంలో మొదటి ర్యాంక్‌ను వి.సీహారిక, రెండో ర్యాంకును కె.సుష్మిత, మూడో ర్యాంకును ఎం.జ్యోతి (నాగార్జున డిగ్రీ కళాశాల, ఒంగోలు), మరో మూడో ర్యాంకును బి.మానీష్ రెడ్డి (ఎస్.ఆర్.కే డిగ్రీ కళాశాల, ఒంగోలు), ఎం.జ్యోతి కైవసం చేసుకున్నారు. బీబీఏ విభాగంలో మొదటి ర్యాంకును కేవీఎల్ దీపక్, రెండో ర్యాంకును వై.స్పందన, మూడో ర్యాంకును ఎం.మోహన మహతి, బీసీఏ విభాగంలో మొదటి ర్యాంకును కె. సంధ్య (శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల, ఒంగోలు), రెండో ర్యాంకును ఎం.లక్ష్మి (నాగార్జున డిగ్రీ కళాశాల, ఒంగోలు), మూడో ర్యాంకును వి.కృష్ణ లాస్య (శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల, ఒంగోలు) విద్యార్థులు వరుస ర్యాంకులను సాధించినట్లు ఏ.కే.యూ అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ అంచుల భారతీదేవి తెలిపారు. అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ఆంధ్ర కేసరి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, ఏ.సి.ఈ.డాక్టర్ భారతీ దేవి తదితరులు అభినందించారు.